క్లుప్తంగా

ప్రసన్న వెంకటేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు

రైల్వేకోడూరు అర్బన్ : రైల్వేకోడూరు పట్టణంలోని ప్రసన్న వెంకటేశ్వరస్వామి దేవాలయంలో శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. మూలవిరాట్‌కు ప్రత్యేక అలంకరణ చేశారు. అనంతరం భక్తులు పూజలు నిర్వహించి తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.

ఘనంగా గంధ మహోత్సవం



విద్యుత్ దీపాలతో అలంకరించిన సిద్దవటంలోని మస్తుమియ్యావలీ దర్గా

సిద్దవటం : మండల కేంద్రమైన సిద్దవటంలోని బత్తేరు కట్ట వద్ద వెలసిన హజరత్ మస్తుమియ్యావలీ గంధం మహోత్సవం శనివారం సాయంత్రం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా జెండాను మస్తుమియ్యావలీ దర్గా నుంచి ఊరేగింపుగా దిగువపేటలోని మహబూబ్ సుబహాని దర్గా వద్దకు తీసుకెళ్లి అక్కడ ప్రార్థనలు చేశారు. అనంతరం దర్గా నుంచి జెండాను ఊరేగింపుగా తీసుకొచ్చి తిరిగి మస్తుమియ్యావలీ దర్గాలో ప్రతిష్టించారు. ఆదివారం ఉరుసు సందర్భంగా అన్నదాన కార్యక్రమ జరుగుతుందని నిర్వాహకులు తెలిపారు.

కలెక్టర్‌ను కలిసిన ప్రభుత్వ విప్ కొరముట్ల



కలెక్టర్ అభిషిక్త్ కిషోర్‌కు పుష్పగుచ్ఛం ఇచ్చి అభినందిస్తున్న విప్ కొరముట్ల శ్రీనివాసులు

రైల్వేకోడూరు : అన్నమయ్య జిల్లా నూతన కలెక్టర్ అభిషిక్త్ కిషోర్ ను శనివారం ప్రభుత్వ విప్ కొరముట్ల శ్రీనివాసులు కలెక్టరేట్‌లో కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలోని పలు భూసమస్యలు, అభివృద్ధికి సంబంధించి పలు అంశాలపై కలెక్టర్‌తో చర్చించినట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు నాయకులు పాల్గొన్నారు.

మన్నూరు సీఐగా రవీంద్రనాథ్



రాజంపేట: రాజంపేటలోని మన్నూరు సీఐగా రవీంద్రనాథ్ సీఐగా శనివారం బాధ్యతలు తీసుకున్నారు. కాగా ఈ స్టేషన్‌కు సంబంధించి ఎస్ఐ భక్తవత్సలం రాయచోటికి బదిలీ అయ్యారు. మన్నూరు పోలీసుస్టేషన్ అప్‌గ్రేడ్ కావడంతో అధికారులు ఎస్ఐకి బదులు సీఐను నియమించారు.

విద్యార్థులకు రక్తనమూనా పరీక్షలు



విద్యార్థుల నుంచి రక్తనమూనా పరీక్షలు సేకరిస్తున్న వైద్య సిబ్బంది

చిన్నమండెం : స్థానిక ఆదర్శ పాఠశాల ఎన్ఎస్ఎస్ సేవా పథకం ఆధ్వర్యంలో దత్తత గ్రామం బెస్తపల్లెలోని పాఠశాల విద్యార్థులకు పీహెచ్‌సీ సీహెచ్ఓ రవిశంకర్ శనివారం రక్త నమూనా పరీక్షలను సేకరించారు. అత్యవసర పరిస్థితుల్లో రక్తం అందించేందుకు రక్త నిర్ధారణ గ్రూపు ఉపయోగపడుతుందని ఎన్ఎస్ఎస్ పీఓ నవీన్‌కుమార్ తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ లోకనాథరెడ్డి, పాఠశాల హెచ్ఎం రెడ్డినాయక్, ఎన్ఎస్ఎస్ వలంటీర్లు, ఉపాధ్యాయులు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

దుస్తులు పంపిణీ



విద్యార్థులకు క్రీడా దుస్తులు అందజేసిన దాతలు

రాయచోటి టౌన్ : రాయచోటి జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు క్రీడా దుస్తులు పంపిణీ చేశారు. జిల్లా స్థాయిలో రాణిస్తున్న విద్యార్థినిలకు మడితాటి సుధాకర్‌రెడ్డి జ్ఞాపకార్థం ఆయన సోదరుడు మడితాటి శ్రీనివాసుల రెడ్డి (కోడి శ్రీనివాసుల రెడ్డి) శనివారం పాఠశాల మైదానంలో 25 మంది విద్యార్థినిలకు ఈ క్రీడా దుస్తులను అందజేశారు. ఈసందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు సైరాబాను మాట్లాడుతూ క్రీడాకారులను ప్రోత్సహించే క్రమంలో వారికి ఇలాంటి దుస్తులు అందించడం అభినందనీయమన్నారు. 13వ వార్డు కౌన్సిలర్ ఫయాజ్ బాష,అన్నమయ్య జిల్లా యూటీఎఫ్ ప్రధాన కార్యదర్శి జాబీర్, జిల్లా వ్యాయమ ఉపాధ్యాయ సంఘం ప్రధాన కార్యదర్శి వీరాంజనేయులు, పీడీలు లలితమ్మ, గోపాల్, నరసరాజు, కోచ్ షఫీ, రవీంద్ర తదితరులు పాల్గొన్నారు.

పార్టీ గెలుపునకు సమిష్టిగా పని చేద్దాం

ఎమ్మెల్యే మేడా, జెడ్పీ చైర్మన్ ఆకేపాటి



సమావేశంలో మాట్లాడుతున్న జెడ్పీ చైర్మన్ ఆకేపాటి, చిత్రంలో ఎమ్మెల్యే మేడా మల్లికార్జున రెడ్డి

రాజంపేట రూరల్ : అందరం సమిష్టిగా కృషి చేసి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి అండగా నిలిచి రానున్న సార్వత్రిక ఎన్నికలలో తిరిగి వైఎస్సార్‌సీపీని అధికారంలోకి తెచ్చుకుందామని ఎమ్మెల్యే మేడా మల్లికార్జునరెడ్డి, జెడ్పీ చైర్మన్ ఆకేపాటి అమరనాథరెడ్డిలు పిలుపునిచ్చారు. స్థానిక మేడా భవన్‌లో శనివారం సాయంత్రం సిద్దవటం మండలంలోని వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలతో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. మన అందరికీ ఒకే కుటుంబం అని అది వైఎస్సార్‌సీపీ కుటుంబమని తెలియజేశారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రవేశ పెట్టిన సంక్షేమ పథకాలను ప్రజలలోకి తీసుకెళ్లి ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి తిరిగి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డిని ముఖ్యమంత్రిని చేసుకునేందుకు ప్రతి ఒక్కరం నడుంబిగించాలని కోరారు. సిద్దవటం మండలంలో వైఎస్సార్‌సీపీకి అత్యధిక మెజార్టీ వచ్చే విధంగా ప్రతి ఒక్కరు కృషి చేయాలని కోరారు. సిద్దవటం ప్రజలకు తాము ఎల్లప్పుడూ అండగా ఉంటామని హామీ ఇచ్చారు. సిద్దవటం బ్రిడ్జి నిర్మాణం పూర్తి చేసే బాధ్యత తమదని తెలియజేశారు. నియోజకవర్గంలో ఫ్యాన్ గుర్తుకు అత్యధిక మెజారిటీ తేవడమే లక్ష్యంగా నేటి నుంచి ప్రతి ఒక్కరం పని చేద్దామని కోరారు. పార్టీని నమ్ముకున్న వారిని పార్టీ అక్కున చేర్చుకుంటుందని తెలియజేశారు. ఈ సమావేశంలో ఎమ్మెల్యే మేడా సోదరుడు మేడా రఘునాథరెడ్డి, జెడ్పీ చైర్మన్ ఆకేపాటి సోదరుడు ఆకేపాటి అనీల్‌కుమార్‌రెడ్డి, జెట్‌పీటీసీ ఉపాసీ శ్రీకాంత్‌రెడ్డి, మండల కన్వీనర్ సింగం నీలకంఠరెడ్డి, రాష్ట్ర మహిళా కార్యదర్శి ఏకుల రాజేశ్వరి, మండల ఉపాధ్యక్షులు ఎస్ శ్రీనివాసులురెడ్డి, నాయకులు ఓబయ్య, డీ శోభన్‌రెడ్డి, నాగం నరసింహారెడ్డి, మాధవరం సర్పంచ్ అవ్వారు జానకిరామయ్య, మాజీ సర్పంచ్ సుబ్బారెడ్డి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రభుత్వ బాలికల వసతి గృహం తనిఖీ



హాస్టల్ నిర్వాహకులతో మాట్లాడుతున్న న్యాయమూర్తి కృష్ణన్ కుట్టీ

రాయచోటి టౌన్ : రాయచోటి పట్టణంలోని ట్రైబల్ వెల్ఫేర్ బాలికల వసతి గృహాన్ని రాయచోటి జిల్లా 5వ అదనపు న్యాయమూర్తి కృష్ణన్ కుట్టీ ఆకస్మిక తనఖీ చేశారు. శనివారం మధ్యాహ్నం విద్యార్థులకు బోజనం వడ్డించే సమయానికి ఆయన ఈ తనిఖీ నిర్వహించారు. విద్యార్థినిలకు వడ్డించే ఆహారాన్ని రుచిచూశారు. అనంతరం విద్యార్థులతో మాట్లాడుతూ నిర్వాహకులు ఇస్తున్న ఆహారం రుచితో పాటు శుభ్రంగా ఉందాలేదాని అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులు తమకు మరుగు దొడ్లు శుభ్రంగా లేవని అలాగే తాగునీటి సమస్య కూడా ఉందని ఫిర్యాదు చేశారు. వెంటనే స్పందించిన ఆయన ఈ విషయాన్ని సంబంధిత ఉన్నతాధికారులతో చర్చించి త్వరగా పరిష్కారం అయ్యే విధంగా చర్యలు తీసుకొంటానని చెప్పారు. మరో సారి ఇదే హాస్టల్‌కు తనిఖీ కోసం వచ్చే నాటికి ఇక్కడ విద్యార్థులకు ఎలాంటి సమస్యలు లేకుండా మంచి రుచికరమైన ఆహారంతో పాటు శుభ్రమైన నీటిని అందించాలని అధికారులకు అదేశాలు జారీ చేశారు.

పేదల పక్షపాతి సీఎం జగన్

ఓబులవారిపల్లె : ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పేదల పక్షపాతి అని వైఎస్ఆర్ పార్టీ అన్నమయ్య జిల్లా కార్యదర్శి సానుగారి సుబ్బారెడ్డి పేర్కొన్నారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతు చంద్రబాబు నాయుడు అధికారంలో ఉన్నప్పుడు సంక్షేమ పథకాలు అందక పేద ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొన్నారన్నారు. సీఎం జగన్‌హన్‌రెడ్డి ప్రజా సంకల్ప యాత్రలో పేదల కష్టలు తెలుసుకొని నవరత్నలు ప్రవేశపెట్టి అమలు చేశారన్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో సంక్షేమ రాజ్యం నడుస్తోందన్నారు. వచ్చే ఎన్నికల్లో అందరు కలిసికట్టుగా రాష్ట్రానికి ముఖ్యమంత్రిగా తిరిగి గెలిపించుకోవాలని కోరారు.

కబ్జాదారుల నుంచి 'మాండవ్య'ను పరిరక్షించాలి

రాయచోటి అర్బన్ : మాండవ్యనదిని కబ్జాదారుల బారి నుంచి కాపాడి పరిరక్షించాలని సీపీఎం అన్నమయ్య జిల్లా కార్యదర్శి శ్రీనివాసులు ఒక ప్రకటనలో కోరారు. అధికారం, అంగబలం గల వ్యక్తులు నదితీరంలో భూములను చదునుచేసి తమ పొలాల్లో కలిపేసుకుంటుంటున్నారంటూ ఆరోపించారు. రాయచోటి జిల్లా కేంద్రం కావడంతో పలువురు అధికారపార్టీ నేతలతో కలసి ప్రభుత్వ భూములను పోటీపడి మరీ ఆక్రమించుకుంటున్నారని పేర్కొన్నారు. పట్టణంలోని లక్ష్మీపురం వద్ద, కదిరి– రాయచోటి ప్రధాన రహదారిలోని నదికి ఇరువైపుల, చెన్నముక్క పల్లె వద్ద నదిని ఆక్రమించి అక్రమకట్టడాలను నిర్మించుకున్నారంటూ వివరించారు.

అప్రెంటీస్ విధానాన్ని రద్దు చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న నరసింహులు

లక్కిరెడ్డిపల్లి : ప్రెంటీస్ విధానాన్ని రద్దు చేసి డీఎస్సీ వదలాలని ఆపస్ జిల్లా అధ్యక్షుడు నరసింహులు డిమాండ్ చేశారు. శనివారం స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన ఉపాధ్యాయ కార్యవర్గ సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇటీవల జరిగిన రాష్ట్ర ప్రభుత్వ మంత్రివర్గ సమావేశంలో అప్రెంటీస్ విధానాన్ని తిరిగి పునరుద్ధరించాలని నిర్ణయం తీసుకోవడం పట్ల ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘం తీవ్రంగా వ్యతిరేకిస్తోందన్నారు. కె వెంకటేశ్వర్లు మాట్లాడారు. ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘం, లక్కిరెడ్డిపల్లి మండల ప్రధాన కార్యదర్శి మనోహర్, శ్రీనివాసులు, జిల్లా సేవా ప్రముఖ్ మల్లయ్య, మండల ఉపాధ్యక్షులు సాయి చరణ్ యాదవ్ తదితర ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బీజేపీ చేసిన అభివృద్ధిని వివరించాలి



సమావేశంలో మాట్లాడుతున్న సాయిలోకేష్

చిట్వేలి : కేంద్ర ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధిని వివరించేందుకు బీజేపీ పల్లెకుపోదాం కార్యక్రమాన్ని మొదలుపెట్టిందని అన్నమయ్య జిల్లా బీజేపీ అధ్యక్షులు సాయిలోకేష్, రాష్ట కార్యవర్గ సభ్యులు పనతల సురేష్ పేర్కొన్నారు. శనివారం చిట్వేలిలో కార్యకర్తలకు జరిగిన అవగాహన కార్యక్రమంలో జిల్లా కన్వీనర్ చెంగల్ రాజుతో కలిసి దిశా నిర్దేశం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి గ్రామంలో పార్టీ కార్యకర్తలు స్థానిక సమస్యలు గుర్తిస్తూ కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న కార్యక్రమాలు, అభివృద్ధిని ప్రజలకు వివరించాలన్నారు. వికసిత్ భారత్ కార్యక్రమాన్ని విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు. ఈ కార్యక్రమంలో సుబ్బరాయుడు, శ్రీనివాసులు, మండల కన్వీనర్ బాపూజీ, జిల్లా మహిళా మోర్చ కార్యదర్శి నిర్మల, విస్తరిక్ ఆది నారాయణ, తదితరులు పాల్గొన్నారు.

బ్యాంక్ మేనేజర్ సేవలు అభినందనీయం



గ్రామీణ బ్యాంక్ మేనేజర్ వెంకటేశును సన్మానిస్తున్న మానవతా సభ్యులు

లక్కిరెడ్డిపల్లి : లక్కిరెడ్డిపల్లె గ్రామీణ బ్యాంక్ మేనేజర్‌గా వెంకటేష్ లక్కిరెడ్డిపల్లెలో జాయిన్ అయినప్పటి నుంచి బ్యాంక్ అభివృద్ధికి చాలా కృషి చేశారని, ప్రజలకు అందుబాటులో ఉంటూ సేవలు అందించారని మానవతా కేంద్ర కమిటీ సభ్యులు వై ప్రసాద్ యాదవ్, చైర్మన్ ఏఎస్ బాల సుబ్రమణ్యం అన్నారు. పదోన్నతిపై నెల్లూరుకు ట్రాన్స్‌ఫర్ అవడంతో మానవతా సభ్యులు బ్యాంక్‌కు వచ్చి మేనేజర్‌ను ఘనంగా సన్మానించారు. మానవతా జిల్లా కార్యదర్శి ఏ శివయ్య, జోనల్ కన్వీనర్ ఇవి కృష్ణ చైతన్య రెడ్డి, జిల్లా సభ్యులు రామాంజనేయులు, అధ్యక్షులు వివి రమణరావు, కోశాధికారి పి రవి కుమార్, వెంకటరమణ, ధను, బ్యాంక్ సిబ్బంది దేవేంద్ర, సాయి తదితరులు పాల్గొన్నారు.

సీపీఓకు సమ్మె నోటీసు అందజేత

ఓబులవారిపల్లె : కేంద్ర ప్రభుత్వం చేస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలకు నిరసనగా అవుట్‌సోర్సింగ్ పోరాట కమిటీ జేఏసీ ఆధ్వర్యంలో ఫిబ్రవరి 16న చేపట్టనున్న సమ్మెకు సంబంధించిన సమ్మె నోటీసును శనివారం సీపీఓ సుదర్శన్ రెడ్డికి అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలకు నిరసనగా దేశ వ్యాప్తంగా సమ్మె నిర్వహించనున్నామన్నారు. సమాన పనికి సమానవేతనం, కనీస వేతనం రూ. 26 వేలు, అవుట్ సోర్సింగ్, ట్రైనీ కార్మికులను రెగ్యులర్ చేయాలని, 8 గంటల పనిని 12 గంటలు చేయడం ఉపసంహరించుకోవాలని తదితర అంశాలపై పోరాటం చేస్తున్నామని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో సిఐటీయు జిల్లా అధ్యక్షులు సిహెచ్ చంద్రశేఖర్, జేఏసీ పోరాట కమిటీ కన్వీనర్ ఆర్ వెంకటేష్, ఉద్యోగులు పాల్గొన్నారు.

నిఘా పెంచాలి

రామసముద్రం : కర్ణాటక సరిహద్దు చెక్‌పోస్టుల వద్ద నిఘా పెంచాలని జిల్లా అడిషినల్ ఎస్పీ రాజ్ కమల్ సూచించారు. శనివారం సాయంత్రం ఆయన రామసముద్రం మండలంలోని కర్ణాటక సరిహద్దుల్లో ఉన్న చెక్‌పోస్టులలో ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఎన్నికలు సమీపిస్తున్న నేపధ్యంలో కర్ణాటక నుంచి అక్రమంగా మద్యం, నగదు రాకుండా జాగ్రత్త వహించాలన్నారు. అదనపు సిబ్బందిని నియమించి చెక్‌పోస్టులలో తనిఖీ చేపట్టాలన్నారు.

ఘనంగా ఆరాధనోత్సవాలు

రామాపురం : రామాపురం మండలం నీలకంట్రావుపేట సమీపంలో వెలసిన శ్రీ దర్బారు సమర్ధ సద్గురు దర్గా స్వామిజీ ఆరాధన ఉత్సవాలు ఘనంగా జరిగాయి. ఇందులో భాగంగా శనివారం మాజీ ఎమ్మెల్యే గడికోట మోహన్‌రెడ్డి , కృష్ణమ్మ దంపతులు పాల్గొని స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ అధికారులు తీర్థప్రసాదాలను అందజేశారు. వారితో పాటు శంకర్ స్వామి, తదితర భక్తులు పాల్గొన్నారు.

సీఎం రిలీఫ్ ఫండ్‌ను సద్వినియోగం చేసుకోవాలి

జెడ్పీ చైర్మన్ అమరనాథ రెడ్డి



బాధితులకు చెక్‌లను అందజేస్తున్న జెడ్పీ చైర్మన్ ఆకేపాటి

రాజంపేట రూరల్ : పేదలకు ఆసరాగా ఉండేందుకు ప్రభుత్వం అందజేస్తున్న సీఎం రిలీఫ్ ఫండ్‌ను బాధితులు సద్వినియోగం చేసుకోవాలని జెడ్పీ చైర్మన్ ఆకేపాటి అమరనాథ రెడ్డి సూచించారు. మండల పరిధిలోని ఆకేపాటి ఎస్టేట్‌లో శనివారం బాధితులకు చెక్కులు పంపిణీ చేశారు. రూ.5లక్ష ల45 వేలు చెక్కులను బాధితులకు పంపిణి చేశారు. సిద్దవటం మండలంలోని ఉప్పరపల్లి గ్రామానికి చెందిన నూకాల వెంకటసుబ్బయ్యకు రూ. 2లక్షలు, రాజంపేట మండలంలోని తాళ్లపాక గ్రామానికి చెందిన సూరపురాజు సుబ్బరాజుకు రూ.1లక్ష, పెనగలూరు మండలం చక్రంపేట గ్రామానికి చెందిన కల్లూరు వెంకటసుబ్బారెడ్డికి రూ.75వేలు, పట్టణంలోని మన్నూరు గ్రామానికి చెందిన పిడుగు మంజులకు రూ.50వేలు, మందపల్లి పంచాయతీ వడ్డిపల్లి అరుధంతివాడకు చెందిన మందపల్లి ప్రసాద్‌కు రూ.50లు, ఒంటిమిట్ట మండలం మాధవరం పంచాయతీ కొండమాచుపల్లి గ్రామానికి చెందిన మావిళ్ల యానాదయ్య గారి వరలక్ష్మికి రూ.40వేలు, ఆకేపాడు పంచాయతీలోని కట్టకిందపల్లి గ్రామానికి చెందిన ఉమ్మడి ఆంజేయులురెడ్డికి రూ.30వేల విలువగల చెక్కులను అందజేశారు. కౌన్సిలర్ సనిశెట్టి నవీన్‌కుమార్, నాయకులు ఎస్ జావీద్‌అలీ, ఎం శ్రీనివాసులగౌడ్, బాధితులు పాల్గొన్నారు.

మామిడిలో తీసుకోవాల్సిన సస్యరక్షణపై శిక్షణ



మామిడి రైతులకు అవగాహన కల్పిస్తున్న ఉద్యానశాఖ అధికారి నాగమణి

గాలివీడు: మండలంలోని నూలివీడు, సీసీపల్లె గ్రామాల్లో ఉద్యాన శాఖ ఆధ్వర్యంలో శనివారం మామిడి పూత, పిందె సమయంలో చేపట్టాల్సిన సస్యరక్షణ చర్యలపై రైతులకు శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించినట్లు ఉద్యానశాఖ అధికారి టి.నాగమణి తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పూత త్వరగా, ఒకేసారి రావడానికి ఆడ పూల శాతం పెరగడానికి 13–0–45 (మల్టీకే) 10 గ్రాములు 1 లీటరు నీటికి, మ్యాంగో స్పెషల్ 5గ్రామాలులు కలిపి పిచికారి చేయాలన్నారు. మామిడిలో పూత మొగ్గదశలోనే తేన మంచు పురుగు, మసి తెగుళ్లు, పక్షి కన్ను తెగుళ్లు, బూడిద తెగుళ్లు ఆశించే అవకాశం ఉందని, వీటి నివారణకు మోనోక్రోటోపాస 1.6 మి.లీ ఒక లీటరు నీటికి , మ్యాంకోజెబ్ 2 గ్రాములు లీటరు నీటికి పిచికారి చేయాలని రైతులకు తెలిపారు. వీటితో పాటు పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో రైతు భరోసా కేంద్రం సహాయకులు రాణాప్రతాప్, మారుతి, మామిడి రైతులు పాల్గొన్నారు.

డ్రైవింగ్‌లో అప్రమత్తత అవసరం



రాయచోటి టౌన్: ర్యాలీగా వస్తున్న అధికారులు



పెనగలూరు: వాహనాలను తనిఖీ చేస్తున్న ఎస్ఐ



సంబేపల్లె: వాహనాల తనిఖీ చేస్తున్న ఎస్ఐ రామకృష్ణ

రాయచోటి టౌన్ : ఒక చిన్న నిర్లక్ష్యం మీ నిండు ప్రాణాలను బలికొనడమే కాకుండా వారి కుటుంబాలను వీధిపాలు చేస్తుందని అర్బన్ సీఐ సుధాకర్ రెడ్డి అన్నారు.

35వ జాతీయ భద్రత వారోత్సవాల నిర్వహణలో భాగంగా రాయచోటి వాహనాల తనిఖీ అధికారి అనిల్‌కుమార్ ఆధ్వర్యంలో బైక్ ర్యాలీ నిర్వహించారురాయచోటి ట్రాఫిక్ సీఐ మహబూబ్ బాషాతో కలిసి ర్యాలీని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మట్లాడుతూ ఒక చిన్నపాటి నిర్లక్ష్యం, అజాగ్రత్త వల్లో జరిగే ప్రమాదాల వల్ల అనేక మంది ప్రాణాలు కోల్పోతున్నారని తెలిపారు. గత ఏడాది అన్నమయ్యజిల్లా వ్యాప్తంగా 699 రోడ్డు ప్రమాదాలు జరిగాయని వాటిలో 365 మంది ప్రాణాలను కోల్పోయారని చెప్పారు. 912 మంది గాయాలపాలయ్యారని వివరించారు. ఇలాంటి ప్రమాదాలలో ఎక్కువగా హెల్మెట్ లేకుండా వాహనాలు నడపడం వలనే ఎక్కువగా ప్రాణాలు కోల్పోయారని ట్రాఫిక్ సీఐ తెలిపారు. వాహనాలు నడిపే సమయంలో తప్పకుండా తగిన రికార్డులు కలిగి ఉండాలని వాహనాల ఎంవీఐ అనిల్‌కుమార్ సూచించారు. అన్ని రికార్డులు తమతో పాటు ఉండాలని చెప్పారు. ద్విచక్రవాహన దారులు తప్పకుండా హెల్మెట్లు ధరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డ్రైవింగ్ స్కూల్ యజమానులు, వివిధ రకాల షోరూం యజమానులు పాల్గొన్నారు.

తాగి నడిపితే కఠిన చర్యలు

పెనగలూరు (ఓబులవారిపల్లె) : డ్రైవర్లు మద్యం తాగి వాహనాలు నడిపితే వారిపై కఠినచర్యలు తీసుకుంటామని నూతన ఎస్ఐ సుభాష్ చంద్రబోస్ హెచ్చరించారు. శనివారం సింగనమల క్రాస్ వద్ద వాహనాలు తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా డ్రైవర్లకు కౌన్సెలింగ్ ఇచ్చారు. అలాగే ఆటోలు, ఫోర్ విల్లర్స్‌లో ప్యాసింజర్లను అధికంగా ఎక్కించరాదన్నారు. డ్రైవర్లకు పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పోలీసులు పాల్గొన్నారు.

రికార్డులు పక్కాగా ఉండాలి

సంబేపల్లె : వాహనదారుల రికార్డులు పక్కాగా ఉండాలని ఎస్ఐ రామకృష్ణ తెలిపారు. శనివారం మండల పరిధిలోని చిత్తూరు–కర్నూలు జాతీయ రహదారిపై నల్లగంగమ్మ దేవాలయం క్రాస్ సమీపంలో వాహనాల తనిఖీ ముమ్మరంగా చేపట్టారు. ఈ సందర్భంగా వాహనదారులు వాహనాల ధృవీకరణపత్రాలు పక్కాగా ఉంచుకోవాలని, ట్రాఫిక్ నియమాలు పాటించాలని ఆయన సూచించారు.

ఎంపీడీఓల బాధ్యతల స్వీకరణ



రామకృష్ణ

చిన్నమండెం : చిన్నమండెం మండల పరిషత్ అభివృద్ధి అధికారిగా రామకృష్ణ శనివారం బాధ్యతలు చేపట్టారు. ఎన్నికల సాధారణ బదిలీలలో భాగంగా రామకృష్ణ బదిలీపై అనంతపురం జిల్లా నుంచి వచ్చారు. ఈ సందర్భంగా కార్యాలయ సిబ్బంది ఆయనకు శుభాకాంక్షలు తెలియజేశారు.

గాలివీడు : మండల నూతన ఎంపీడీఓగా పీ.డి.శ్రీనివాసులు శనివారం బాధ్యతలు స్వీకరించారు. అనంతపురం జిల్లా కనకల్లు మండలం నుంచి బదిలీపై గాలివీడు మండలానికి వచ్చారు. మండల అభివృద్ధికి తనవంతు కృషి చేస్తానని తెలిపారు.



ప్రభాకర్

రామాపురం : మండల అభివృద్ధి అధికారిగా డి. ప్రభాకర్ శనివారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ పని చేసిన ఎంపీడీఓ హైదర్‌వల్లి చక్రాయపేట మండలానికి బదిలీపై వెళ్లిన విషయం విదితమే.



కుళ్లాయస్వామి

ఓబులవారిపల్లె : స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో శనివారం ఎంపీడీఓగా కుళ్లాయస్వామి బాధ్యతలు చేపట్టారు. అనంతరం ఆయన పంచాతీ కార్యదర్శులతో ప్రత్యేకంగా సమావేశం నిర్వహించారు. మండల అభివృద్ధికి అన్ని విధాల సమర్ధవంతంగా కృషి చేస్తానని.. అందరూ సహకరించాలని కోరారు. గతంలో ఎంపీడీఓగా పని చేసిన విజయారావు నంద్యాలకు బదిలీ అయ్యారు.

హౌసింగ్ రిజిస్ట్రేషన్‌ల ప్రక్రియ వేగవంతం

సిద్దవటం : జగనన్న లేఅవుట్ కాలనీలకు సంబంధించిన హౌసింగ్ రిజిస్ట్రేషన్‌ల ప్రక్రియను వేగవంతం చేయాలని కడప ఆర్డీఓ మధుసూదన్ మండల అధికారులను సూచించారు. సిద్దవటం మండలంలోని పెద్దపల్లి గ్రామ సచివాలయాన్ని శనివారం ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన హౌసింగ్ రిజిస్ట్రేషన్‌లను పరిశీలించారు. సిద్దవటం మండలంలోని పెద్దపల్లి, సిద్దవటం గ్రామ సచివాలయాల్లో 66 హౌసింగ్ రిజిస్ట్రేషన్‌లు జరగడంతో ఆయన సంతృప్తి వ్యక్తం చేశారు. మండలంలోని 10 సచివాలయాలు ఉండగా ఒక్కోసచివాలయానికి రోజుకు 50 లక్ష్యంగా హౌసింగ్ రిజిస్ట్రేషన్‌లు చేయాలని ఆదేశించారు. మురాద్వావలి, పంచాయతీ కార్యదర్శి ప్రసాద్‌రెడ్డి, విఆర్‌వో నాని, సచివాలయ సిబ్బంది తదిరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ సిబ్బందికి ఆరోగ్య పరీక్షలు

జిల్లా ప్రజా రవాణాధికారి రాము



మాట్లాడుతున్న జిల్లా ప్రజారవాణాధికారి రాము

మదనపల్లె సిటీ : ఆర్టీసీకి సిబ్బందికి తరచూ ఆరోగ్య పరీక్షలు నిర్వహించనున్నట్లు జిల్లా ప్రజా రవాణాధికారి రాము అన్నారు. రోడ్డు భద్రతా మాసోత్సవాల్లో భాగంగా శనివారం టు డిపో కార్యాలయంలో దృష్టి కంటి ఆస్పత్రి ఆధ్వర్యంలో సిబ్బందికి ఉచితం కంటి పరీక్షలు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ డ్రైవర్లు రోడ్డు, నియమ నిబంధనలు తప్పకుండా పాటించాలన్నారు. జీరో యాక్సిడెంట్ డిపోలుగా మార్చాలన్నారు. ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణం సురక్షితమన్నారు. ఆ నమ్మకాన్ని కాపాడాలని, యాక్సిడెంట్లు జరగకుండా చూడాలని సూచించారు. మద్యం తాగడం, సెల్‌ఫోన్‌లో మాట్లాడుతూ డ్రైవింగ్ చేయడం చేయకూడదన్నారు. కార్యక్రమంలో వన్,టు డిపో మేనేజర్లు మూరే వెంకటరమణారెడ్డి, ఆర్‌సీ నిరంజన్, సైకాలజిస్టు సుధాకర్‌రెడ్డి, సీఐలు రేవతి, గీత తదితరులు పాల్గొన్నారు. అలాగే వన్ డిపో కార్యాలయంలో ఆర్టీవో శివలింగయ్య రోడ్డు భద్రతా వారోత్సవాల్లో పాల్గొని డ్రైవర్లకు సలహాలు, సూచనలు ఇచ్చారు.

షమీమ్‌అస్లామ్‌కు క్రైస్తవ పాస్టర్ల సన్మానం



షమీంఅస్లాంను సన్మానిస్తున్న క్రైస్తవ పాస్టర్లు

మదనపల్లె : ఏపీఎండీసీ చైర్‌పర్సన్‌గా రెండోసారి అవకాశం దక్కించుకున్న వైఎస్సార్ సీపీ మహిళానాయకురాలు షమీమ్‌అస్లామ్‌ను శనివారం క్రైస్తవ విభాగం జిల్లా అధ్యక్షులు బోనాసిజాన్‌బాబు ఆధ్వర్యంలో క్రైస్తవ పాస్టర్లు ఘనంగా సన్మానించారు. స్థానిక ఎస్‌వీఆర్ లేఅవుట్‌లోని ఆమె స్వగృహానికి వెళ్లి దుశ్శాలువ, పుష్పగుచ్ఛంతో అభినందనలు తెలిపారు. మైనారిటీ వర్గానికి చెందిన మహిళ ఉన్నత పదవులను అలంకరించడం తమకెంతో సంతోషంగా ఉందని, భవిష్యత్తులో ప్రజల ఆదరాభిమానాలతో మరింత ఉన్నత స్థానాలకు ఎదగాలని ఆశీర్వదించారు. ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఫిబ్రవరి 3వ వారంలో మదనపల్లె సీఎస్ఐ కమ్యూనిటీ హాల్‌లో నిర్వహించనున్న క్రైస్తవ మైనారిటీ హక్కుల అవగాహన సదస్సు నిర్వహిస్తున్నామని, సమావేశానికి హాజరవ్వాల్సిందిగా ఆహ్వానం అందించారు. క్రైస్తవులకు శ్మశాన వాటిక స్థలం ఏర్పాటుకు సహకరించాల్సిందిగా కోరారు. కార్యక్రమంలో పాస్టర్లు జలదప్రసాదరావు, బోయాజ్, జీవరత్నం, శ్యామూల్, దేవమణి, బాబు యోహాన్, అలీసమ్మ, రేచల్, పద్మ, క్రైస్తవ అనుబంధ విభాగ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

బహుజనులకు రాజ్యాధికారం రావాలి

మదనపల్లె : అణగారిన వర్గాల ప్రజలు బాగుపడాలంటే...బహుజనులకు రాజ్యాధికారం రావాలని బహుజన్ సమాజ్ పార్టీ ఎంపీ రామ్‌జీ గౌతమ్ అన్నారు. శనివారం మదనపల్లెలో బీఎస్పీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బండెల గౌతమ్‌కుమార్ ఆధ్వర్యంలో జరిగిన బహుజన రాజ్యాధికార సదస్సుకు ఎంపీ రామ్‌జీ గౌతమ్, బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షులు బి.పరంజ్యోతి, సెంట్రల్ కోఆర్డినేటర్ బాలయ్య, రిటైర్డ్ జడ్జి గుర్రప్ప ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా పట్టణంలో బీఎస్పీ శ్రేణులు నిర్వహించిన ర్యాలీలో జిల్లా వ్యాప్తంగా బీఎస్పీ కార్యకర్తలు, నాయకులు పాల్గొన్నారు. ముందుగా అంబేడ్కర్, పూలే, కాన్షీరామ్ చిత్రపటాలకు పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం ఏర్పాటుచేసిన సమావేశంలో బీఎస్పీ ఎంపీ రామ్‌జీ గౌతమ్ మాట్లాడుతూ...భవిష్యత్తు బహుజనులదేనని, బడుగు, బలహీనవర్గాల ప్రజలు బహుజన సమాజ్ పార్టీని ఆదరించాలన్నారు. కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం నియంతృత్వపాలన సాగిస్తూ, అణగారిన వర్గాల హక్కులను కాలరాస్తోందన్నారు. మతతత్వపార్టీలను గద్దె దించి, బహుజనులకు రాజ్యాధికారం దిశగా కృషిచేస్తేనే న్యాయం జరుగుతుందన్నారు. బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షులు బి.పరంజ్యోతి మాట్లాడుతూ..రాష్ట్రంలో కేవలం రెండుకులాలు, నాలుగు పార్టీలు మాత్రమే ప్రభుత్వాలు నడుపుతున్నాయని, వీటికి రానున్న ఎన్నికల్లో చెక్ పెట్టాలన్నారు. బహుజన కులాలు ప్రభుత్వాలు అందించే సంక్షేమ పథకాలకు ఎదురుచూడటం మానుకుని, తమ జీవితాల్లో వెలుగులు తెచ్చే దిశగా యోచన చేయాలన్నారు.